సాక్షి నిజామాబాద్

సోమవారం ; 3 ; జూన్ ; 2024



నువ్వుల విక్రయానికి..

మార్కెట్‌లో నువ్వులకు ఆశించిన ధర లభించకపోవడంతో రైతులు పంటను విక్రయించడానికి ఆసక్తి చూపించడం లేదు.

- 8లో ▸



కత్తులతో దాడి

నగరంలోని హైమద్‌పురా కాలనీలో కత్తులతో దాడి చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.0 /30.2

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ నీటి విడుదల రేపటికి వాయిదా

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను వాయిదా వేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆదివారంనుంచి నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రెండు రోజులు ఆలస్యంగా నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. మంగళవారం సాయంత్రంనుంచి నీటిని విడుదల చేయనున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ అధికారులకు నెమలి అప్పగింత



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని నెమలికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ నెమలిని పంచాయతీ కార్యాలయానికి తీసుకువచ్చారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ అధికారులు కలిసి గాయాలైన నెమలిని అటవీ శాఖ బీట్ ఆఫీసర్ హైందవికి అప్పగించారు.

బడి బాట కార్యక్రమం వాయిదా

నిజామాబాద్‌అర్బన్: నేటి నుంచి ప్రారంభం కానున్న బడిబాట కార్యక్రమం వాయిదా పడింది. కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. తిరిగి కార్యక్రమం నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

'రైతులు కల్లాలను నిర్మించుకోవాలి'



కామారెడ్డి రూరల్: ప్రతి రైతు పంట ఉత్పత్తులను ఆరబోసుకోవడానికి కల్లాలను నిర్మించుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన రాజంపేట మండలంలోని రాజంపేట, పెద్దాయిపల్లి, తలమడ్ల, ఆరేపల్లి, శివాయిపల్లి, పొందుర్తి, కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లి, లింగాయిపల్లి, తిమ్మక్‌పల్లి, చిన్నమల్లారెడ్డి, సరంపల్లి, లింగాపూర్, టేక్రియాల్ గ్రామాల్లో పర్యటించి, రైతులతో సమావేశాలు నిర్వహించారు. రైతు కల్లాల నిర్మాణంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో పండించిన పంటను ఎక్కడ ఆరబోసుకోవాలో తెలియక రోడ్లపై ఆరబోసుకుంటున్నారన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. కల్లాలను నిర్మించుకుంటే ఈ ప్రమాదం తప్పుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట ఉత్పత్తులను ఆరబోసుకోవచ్చని పేర్కొన్నారు. రైతు కల్లాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు, రైతులు ఉన్నారు.

అన్ని రంగాల్లో ముందంజ



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎమ్మెల్యే ధన్‌పాల్, సీపీ కల్మేశ్వర్

- అమరుల ఆశయాలకనుగుణంగా అడుగులు వేస్తున్నాం
- అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న జిల్లా
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సుభాష్‌నగర్: తెలంగాణ అమరుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకెళ్లడం మనందరి కర్తవ్యమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. తదనుగుణంగానే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం సహా అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ఇదే స్ఫూర్తితో జిల్లాను మరింత ప్రగతిబాటలో పయనింపజేసేందుకు పనిచేస్తామని వివరించారు. జిల్లాలోని అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలో 793 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు కొనసాగుతున్నాయన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు శాతం పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో యూనిఫాంలు కుట్టి ఇచ్చే పనులను ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించిందని, తద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. జిల్లాలో ఈసారి పదోతరగతి, ఇంటర్మీడియేట్ వార్షిక ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారని, పదిలో రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా ఉండాల నే లక్ష్యంతో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఆర్థి కంగా బలపరుస్తుందని తెలిపారు. రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు నేరుగా రాష్ట్ర అధికారులతో, వ్యవసాయ నిపుణులతో మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని వివ రించారు. ఇటీవల జరిగిన పార్ల మెంట్ ఎన్నికలను సజావుగా, శాంతియుతంగా నిర్వహించామన్నా రు. వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరులకు ఘననివాళులు

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల అమరవీరుల స్మారక స్థూపం వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, సీపీ, అదనపు కలెక్టర్



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా..

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తమ కట్టుబొట్టు, ప్రత్యేక వేషధారణలతో ఆవిష్కరింపజేశారు. చూడచక్కని నృత్య ప్రదర్శనలతో జానపద కళ ఔన్నత్యాన్ని చాటారు. కలెక్టర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రదర్శనలు ముగిసిన అనంతరం చిన్నారులను వేదికపైకి ఆహ్వానించి వారిని అభినందిస్తూ ప్రోత్సహించారు.





నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లెక్కింపు పక్కాగా జరగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- కౌంటింగ్ కేంద్రం పరిశీలన

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ జరపాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్నివిధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్‌పల్లిలోని సీఎంసీ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ ఎలిస్‌వజ్ ఆర్, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ఆదివారం సందర్శించారు. నియోజకవర్గంలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్‌రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

కౌంటింగ్‌కు సన్నద్ధం



- కలెక్టర్ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- తొలుత పోస్టల్ బ్యాలెట్.. ఆ తర్వాతే ఈవీఎం ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకే కౌంటింగ్ ప్రారంభం
- లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ఓట్లు ఈనెల 4న లెక్కించేందుకు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో చేపట్టనున్నారు. నిజామాబాద్ సెగ్మెంట్‌లోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, కోరుట్ల, జగిత్యాల్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు రెండు రౌండ్లలో పూర్తి చేయనున్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈసీ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి. కౌంటింగ్ కేంద్రంలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

అసెంబ్లీ నియోజకవర్గం	టేబుళ్లు	రౌండ్లు
నిజామాబాద్ అర్బన్	20	15
నిజామాబాద్ రూరల్	20	15
ఆర్మూర్	18	13
బాల్కొండ	18	14
బోధన్	18	14
కోరుట్ల	18	15
జగిత్యాల	18	15
పోస్టల్ ఓట్లు	10	2



సీఎంసీలోని కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే ఓట్ల లెక్కింపునకు అవసరమైన సిబ్బందిని కేటాయించి, వారికి శిక్షణనిచ్చారు. సిబ్బంది ర్యాండమైజేషన్ జరిపి, ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించనున్నారు. టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, సూపరింటెండెంట్, మరో అసిస్టెంట్‌ను నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి టేబుళ్ల ఆధారంగా సిబ్బంది కేటాయింపులు చేశారు. రౌండ్‌వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను ఎన్‌కోర్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేస్తారు. అదేవిధంగా గుర్తింపు పొందిన పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి టేబుల్‌కు ఒక ఏజెంట్ చొప్పున అవకాశం కల్పించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఆరు గంటలకే ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకునేలా ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

నిజామాబాద్ లోక్‌సభ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. రౌండ్ల వారీగా ఓట్లు లెక్కించి రిటర్నింగ్ అధికారి వివరాలు వెల్లడిస్తారు. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 20 చొప్పున, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, జగిత్యాల్, కోరుట్లకు 18 చొప్పున, పోస్టల్, సర్వీస్ ఓట్ల కోసం మరో 10 టేబుళ్ల చొప్పున ఏర్పాటుచేశారు. అదేవిధంగా నిజామాబాద్ అర్బన్, రూరల్, కోరుట్ల, జగిత్యాల్ నియోజకవర్గ ఓట్లు 15 రౌండ్లు, బాల్కొండ, బోధన్ 14, ఆర్మూర్ 13 రౌండ్లు, పోస్టల్, సర్వీస్ ఓట్లు 2 రౌండ్లలో లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ, ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోనున్నారు. ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిపుణులకు సమాచారమివ్వనున్నారు. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని ఈసీ ఆదేశాలిచ్చింది.

మహాలక్ష్మి కోసం మహిళల నిరీక్షణ

- ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రతినెలా రూ. 2,500 ఇస్తామని హామీ
- మార్గదర్శకాలను సిద్ధం చేయని ప్రభుత్వం
- త్వరగా అమలు చేయాలని కోరుతున్న అతివలు



మోర్తాడ్(బాల్కొండ): అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ. 2,500ల చొప్పున ఆర్థిక సాయం అందించడానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని రేవంత్ రెడ్డి సర్కారు ఇంకా పచ్చజెండా ఊపలేదు. ఫలితంగా ఈ పథకం కింద సాయం కోసం ఎంతో మంది మహిళలు నిరీక్షిస్తున్నారు. ప్రధానంగా ఆసరా పథకం కింద పింఛన్ అందుకోలేని మహిళలు తమకు మహాలక్ష్మి సాయం కొండంత అండగా ఉంటుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా ఆర్థిక సాయం అందిచడం ఒకటి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 53,196 కోట్లను కేటాయించింది. ఆసరా పథకం కింద జిల్లాలో 77,158 మంది వితంతువులు, 10,520 మంది ఒంటరి మహిళలు, 96,264 మంది బీడీ కార్మికులు ప్రతినెలా పింఛన్లను అందుకుంటున్నారు. వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లలోనూ కొంత మంది అర్హులైన మహిళలు ఉన్నారు. జిల్లాలో 7,18,603 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో ఆసరా పింఛన్లను అందుకోలేని మహిళలు మహాలక్ష్మి సాయం ద్వారా లబ్ధి పొందవచ్చని భావిస్తున్నారు. ఇప్పటి వరకు మార్గదర్శకాలను రూపొందించకపోవడంతో మహాలక్ష్మి సాయం ఎంత మందికి వస్తుంది, ఎవరు అర్హులనే విషయం తేలుతుంది. అసలు మహాలక్ష్మి పథకం అమలు చేస్తారా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో ఎలాంటి సర్వే జరపకపోవడం, అర్హుల ఎంపికకు చర్యలు తీసుకోకపోవడంతో పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తంతు ఎలాగూ ముగిసిపోయింది. మరో వారం రోజుల్లో కోడ్ ఎత్తివేసే అవకాశం ఉంది. అప్పటికైనా మహాలక్ష్మి సాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని పలువురు కోరుతున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- తమ్ముడి అంత్యక్రియల్లో గుండెపోటుతో అన్న మృతి
- కామారెడ్డి జిల్లా కృష్ణాజీవాడిలో విషాదం

తాడ్వాయి: తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక తల్లడిల్లిన అన్న గుండె సైతం ఆగిపోయింది. ఈ విషాద ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన దాసరి నర్సింలు(41) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం అప్పులు చేసి మస్కట్ వెళ్లాడు. గతనెల 14న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు మృత్యువాతపడ్డాడు. అతడి మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనకు గురైన అన్న పెద్ద నర్సింలు.. అంతిమ యాత్రలో గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కామారెడ్డిలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. గుండెపోటుతో మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరూ మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



నర్సింలు, పెద్ద నర్సింలు(ఫైల్)



బెటాలియన్‌లో జెండాకు వందనం చేస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్



జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో..



తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ యాదగిరి..

ఘనంగా ఆవిర్భావ వేడుక



రాష్ట్ర అవతరణ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతోపాటు ఆయా పట్టణాలు, గ్రామాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌తోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ప్రముఖులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



డీసీసీబీ కార్యాలయంలో..



అమరులకు నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్



జిల్లా కోర్టులో..





నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..

నువ్వుల విక్రయానికి నిరాసక్తత

- ధర ఇంకా పెరిగేవరకు నిలువ ఉంచాలని భావిస్తున్న రైతులు
- క్వింటాలుకు రూ.15 వేల ధర లభించాల్సి ఉంటే రూ.13,250 దాటని వైనం
- డిమాండ్ పెరుగుతుందనే ఉద్దేశంతో నిలువ చేస్తున్న రైతులు



మోర్తాడ్‌లో సాగు చేసిన నువ్వు పంట (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): నువ్వుల మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో వాటిని విక్రయించడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ముందు ముందు తాము ఆశించిన ధర లభిస్తుందనే ఉద్దేశంతో నువ్వుల నిలువకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో క్వింటాలు నువ్వులకు రూ.15 వేల వరకు ధర లభించాల్సి ఉండగా కొన్ని రోజులుగా రూ.13,250కి మించి ధర పలకడం లేదు. గత సీజనులో క్వింటాలు నువ్వులకు రూ.18,500ల వరకు పలికింది. ఒక సందర్భంలో ఏకంగా ధర రూ.20 వేలకు పెరిగి స్టాకిస్టులకు భారీగా లాభం తెచ్చిపెట్టింది. ఈ సారి కూడా నువ్వుల మార్కెట్ ఆరంభమైన నాటి నుంచి ధర ఆశాజనకంగానే ఉండగా రైతులు వ్యాపారులకు ఎక్కువగానే విక్రయించారు. గుజరాత్, పూణే మార్కెట్‌లలో నువ్వులకు డిమాండ్ ఉందని, ధర బాగా పెరిగే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. అప్పటి నుంచి నువ్వులను విక్రయించే రైతులు ఆలోచనలో పడ్డారు. గతంలో మాదిరిగా ఏదో ఒక రోజు ధర భారీగానే పెరుగుతుందని, అందువల్ల ఇప్పుడు తొందరపడి విక్రయిస్తే లాభం తగ్గిపోతుందని రైతులు భావించి నిలువ చేసుకోవడంపై దృష్టి సారించారు.

ధర తగ్గించిన పాకిస్తాన్..

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన దాయాది దేశం పాకిస్తాన్ నువ్వుల ధరను అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గించిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. క్వింటాలు నువ్వులను రూ.13,500లకే డెలివరీ చేయడానికి పాకిస్తాన్ సుముఖత వ్యక్తం చేయడం వల్ల నువ్వుల మార్కెట్‌కు డిమాండ్ తగ్గింది. పాకిస్తాన్ ధర తగ్గించడంతో మన దేశంలో సాగు చేసిన నువ్వులకు ధర పడిపోయింది. ఫలితంగానే రైతులు తక్కువ లాభానికి విక్రయించడం అవసరం లేదనే నిర్ణయానికి వచ్చారు. పాకిస్తాన్ నువ్వుల విక్రయం పూర్తయిన తరువాత మన నువ్వులకు డిమాండ్ వస్తుందని అప్పటి వరకు వేచి చూద్దామనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

ఎక్కువ మంది నిలువ చేస్తున్నారు



నువ్వులకు ధర తక్కువగా ఉండటంతో లాభాలు ఉండవనే ఉద్దేశంతో ఎక్కువ మంది రైతులు నిలువ చేయడంపై దృష్టి సారించారు. నగదు ఎక్కువగా అవసరం ఉన్న రైతులే నువ్వులను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ముందు ముందు ధర పెరుగుతుందని రైతులు ఆశతో ఉన్నారు.

– రొక్కం మురళి, రైతు, తిమ్మాపూర్

ఉత్తమ అవార్డులు అందుకున్న విద్యుత్ ఉద్యోగులు



అవార్డుపొందిన ఉద్యోగులు



కంపెనీ లెవల్ ఉత్తమ ఏఈ గంగశేఖర్



సర్కిల్ ఉత్తమ ఏడీఈ తోట రాజశేఖర్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం హన్మకొండ ప్రధాన కార్యాలయం నిజామాబాద్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డులతో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సన్మానించారు. ఉత్తమ అవార్డులు పొందిన వారిలో ఎస్ఈ నిజామాబాద్ ఆపరేషన్ ఆర్.రవీందర్, ఏడీఈ ఓపీ నవీపేట సుహాసిని, ఏడీఈ–2 నిజామాబాద్ తోట రాజశేఖర్, ఏఈ బర్దిపూర్ రాజేందర్, ఏఏఈ డి–2 నిజామాబాద్ సుమిత, ఏఏఈ కోటగిరి కృష్ణ, ఏఈ సుభాష్‌నగర్ గంగశేఖర్, ఎల్ఎం బోధన్‌టౌన్–1 చంద్రకాంత్, ఎల్ఎం దేగాన్ షీలా శివకుమార్‌లు ఉన్నారు.







ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు.. ధర్పల్లి మండలం దుబ్బాకలో..

నగరంలోని శంకర్ భవన్ పాఠశాల పూర్వ విద్యార్థులు..

అ'పూర్వ' సమ్మేళనం

బాల్కొండ/ధర్పల్లి/ఖలీల్‌వాడి/నిజామాబాద్‌అర్బన్/దోమకొండ/తాడ్వాయి : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు నాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. సుమారు మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ముప్కాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(1994–95), ధర్పల్లి మండలం దుబ్బాక జెడ్పీ స్కూల్(1998–99), నిజామాబాద్ నగరంలో శ్రీవిశ్వశాంతి (2002–03), శంకర్‌భవన్(1990–91), తాడ్వాయి ఉన్నత పాఠశాలలో (2005–06) పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు.



దోమకొండ త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో..



నగరంలోని విశ్వశాంతి స్కూల్‌లో..



తాడ్వాయి మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆశ్రమ విద్యార్థులకు రూ.50వేల సాయం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ ఉన్నత పాఠశాలలో(1999–2000) బ్యాచ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఫ్రెండ్స్ హోప్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు బాల్కొండలోని మహతి ఆశ్రమంలోని అరక్షిత పిల్లలను కార్యక్రమానికి ఆహ్వానించి వారి మధ్య ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమానికి రూ.50వేల సాయం అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



తాళ్లరాంపూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కిడ్నాప్ కలకలం

ఖలీల్‌వాడి: ఆటో కిరాయి అడిగినందుకు ఓనర్‌ను డ్రైవర్ కిడ్నాప్ చేసిన ఘటన నగరంలో కలకలం సృష్టించింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రనగర్‌కు చెందిన మఠం రమణయ్యకు చెందిన ఆటోను గాంధీనగర్‌కు చెందిన కల్లూరి లక్ష్మణ్ కిరాయికి తీసుకున్నాడు. రెండు నెలలుగా లక్ష్మణ్ ఆటో కిరాయి చెల్లించకపోవడంతో డబ్బులు చెల్లించాలని రమణయ్య తరచూ అడిగాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం శివాజీనగర్ ఐటీఐ కళాశాల సమీపంలో రమణయ్యను లక్ష్మణ్ కిడ్నాప్ చేసి నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్బంధించి అర్ధరాత్రి సమయంలో వదిలేశాడు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతారిపల్లికి చెందిన ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. సుతారిపల్లికి చెందిన ఎర్రోల మురళి బస్వాపూర్ గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మురళి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి ఒకరి మృతి

మాక్లూర్: పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని మానిక్‌బండార్‌కు చెందిన గుండారం సురేశ్(43) జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేసే సురేశ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గతనెల 27వ తేదీన పురుగుల మందు తాగాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సంతానం కావడం లేదని ఆత్మహత్య

రుద్రూర్: సంతానం కావడం లేదని మనస్తాపంతో పామ్మోడి గజేందర్(35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరికి చెందిన పామ్మోడి గజేందర్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహంకాగా సంతానం కాకపోగా, ఎనిమిది నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయిన భార్య మమత తిరిగిరాలేదు. దీంతో మనస్తాపానికి గురైన గజేందర్ ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

బోధన్‌రూరల్: మండలంలోని ఏరాజ్‌పల్లికి రాంచందర్ ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కే సతీశ్, బీ సంజీవ్, కే సాయిరెడ్డి, ఎల్ రఘు, పి రాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ (మే 13న) రోజున రాంచందర్ ఓ పార్టీకి ఏజెంట్‌గా పని చేశాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న రాంచందర్‌ను సతీశ్, సంజీవ్, సాయిరెడ్డి, రఘు, రాజు అడ్డుకుని 'మాకు వ్యతిరేకంగా పనిచేస్తావా..' అని కులం పేరుతో దూషిస్తూ, నీ అంతు చూస్తామని బెదిరించారు. ఈ ఘటనపై బాధితుడు రాంచందర్ ఆదివారం సాయంత్రం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు.

నగరంలో కత్తులతో దాడి

- చెదరగొట్టిన పోలీసులు
- ఇరువర్గాలపై కేసు నమోదు
- శనివారం రాత్రి ఘటన



గొడవపడుతున్న వారిని చెదరగొడుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో రెండు వర్గాలు కత్తులతో పరస్పరం దాడి చేసుకున్నాయి. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైమద్‌పురా కాలనీలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైమద్‌పురా కాలనీకి చెందిన సోహైల్ భార్యతో విబేధాలు తలెత్తడంతో ఇద్దరి తరఫునవారు పంచాయితీ పెట్టారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సోహైల్ భార్య బంధువులు కత్తులతో దాడి చేయడంతో సోహైల్‌తోపాటు అతని సోదరుడికి గాయాలయ్యాయి. వెంటనే తేరుకున్న సోహైల్ తరఫు వారు ప్రతి దాడికి దిగారు. ఈ ఘటనలో ఎండీ సమీర్, రెహమాన్‌కు గాయాలయ్యాయి. గాయపాలైనవారిని వారి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఇరు వర్గాలకు చెందిన బంధువులు ఆస్పత్రికి చేరుకోగా, పోలీసులు వారిని చెదరగొట్టారు. రెండు వర్గాలకు చెందినవారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



రెంజల్(బోధన్): మండలంలోని పేపర్‌మిల్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

రామారెడ్డి: సదాశివనగర్ మండల కేంద్రంలోని సత్య పీర్ల దర్గా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలో సోమవారం తాగునీటి సరఫరాకు అంతరాయతం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా పైపులైన్ వాల్స్ మార్చడంతో పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. నగరంలోని గౌతంనగర్, నాందేవ్‌వాడ (పాత), నాందేవ్‌వాడ (అర్చన హాస్పిటల్), గోల్ హనుమాన్, వినాయక్‌నగర్, తిలక్ గార్డెన్ ఏరియా, ఎల్లమ్మగుట్ట, మహలక్ష్మీనగర్, మిర్చి కాంపౌండ్, సుభాష్‌నగర్, కంఠేశ్వర్ (కొత్త), కంఠేశ్వర్ (పాత), పంచాయత్‌రాజ్ కాలనీ, కంఠేశ్వర్ (గడ్డ), గంగస్థాన్ (ఫేజ్–1)లో తాగునీటి సరఫరా ఉండదన్నారు. ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ప్రజలు గమనించి నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.

నాలుగు ఇళ్లలో చోరీ

వర్ని: మండల కేంద్రంలోని శ్రీనివాసకాలనీ, పాత వర్ని గ్రామాల్లోని నాలుగు ఇళ్లలో ఆదివా రం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడినట్లు రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస కాలనీలో ఏంబడి గంగవ్వ, రశీద్, పాత వర్నిలో బొగ్గుల రాజేందర్, గంగమణి ఇళ్లలోకి దుండగులు చొరబడి సుమారు ఆరు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు సీఐ తెలిపారు.